క్లుప్తంగా

పేదలకు అన్నదానం



నెల్లూరు(అర్బన్): నగరంలోని సాయిసేవా సదన్ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు దాత చేవూరి సుధాకర్ ఆదివారం అన్నదానం చేశారు. తన భార్య వర్ధంతిని పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే రక్షణ్ జన్మదినం సందర్భంగా చిరువ్యాపారులు, యాచకులకు మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. వైకుంఠపురంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వమాత సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు దూబిశెట్టి కళ్యాణి, సభ్యులు అనూష, ఉషారాములు పాల్గొన్నారు.

నారాయణలో అరుదైన శస్త్రచికిత్స



నెల్లూరు(అర్బన్): నగరానికి చెందిన 43 ఏళ్ల జానకికి ఆరోగ్యశ్రీ ద్వారా రూపాయి ఖర్చు లేకుండా అత్యంత అరుదైన శస్త్ర చికిత్స చేసి 25 ఏళ్ల అనారోగ్య సమస్యకు పరిష్కారం చూపామని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. నారాయణ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈఎన్‌టీ స్పెషలిస్ట్ రమేష్‌బాబు శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. జానకి 25 ఏళ్లుగా ఆయాసంతో బాధపడుతూ ఆమె పలు ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయించుకుందని తెలిపారు. యాంటీబయాటిక్స్, పల్మనాలజీ మందులు వాడితే ఆయాసం తగ్గేదని, మందులు ఆపితే మళ్లీ వచ్చేదన్నారు. గత నెల 26న ఆమె తీవ్రమైన ఆయాసం, దగ్గుతో నారాయణ ఆస్పత్రికి రాగా అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి థైరాయిడ్ గడ్డ రెండు ఊపిరితిత్తుల మధ్యగా గుండె సమీపం వరకు పెరిగినట్లు గుర్తించామన్నారు. ఈ కారణంగానే ఇతర వైద్యులు గుర్తించలేకపోయారన్నారు.ఈ స్థితిలో రోగికి ధైర్యం చెప్పి థొరాసిక్, వ్యాస్కులర్ సర్జన్ డాక్టర్ టీఆర్ ద్వారకానాథ్, ఈఎన్‌టీ విభాగం హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ జనార్దన్‌రావు, వైద్యులు విజేత, ఇంద్రనీల్‌రెడ్డి బృందం అతిక్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసి థైరాయిడ్ గడ్డను తొలగించారని వివరించారు. ప్రస్తుతం రోగి కోలుకోవడంతో డిశ్చార్జి చేస్తున్నామని వారు తెలిపారు.

కార్పొరేటర్లకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ అంధుల సమైఖ్య ఆధ్వర్యంలో వెంకటేశ్వరపురంలో మహిళా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. 53, 54వ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు దేవరకొండ సుజాత, షేక్ సఫియాను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు జమీర్‌అహ్మద్, సనావుల్లా, జక్కావుల్లా, బాబు, గుమ్మడి శీనయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరుకు చెందిన హేమకుమార్ ఇటీవల పక్షవాతానికి గురికాగా విద్యా ఫౌండేషన్ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం వారి ఇంట్లో అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి శ్రీపతి రాము మాట్లాడుతూ బాధితుడి కుమార్తె పదో తరగతి చదువుకు ఆర్థికంగా చేయూత అందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు క్రిమస్, భవానీశంకర్, శాంతివర్ధన్, పవన్, డానియేల్, కెవిన్, జశ్వంత్, సందీప్, అఖిల్ పాల్గొన్నారు.

గీతా ఆశ్రమంలో ఆరాధనోత్సవం



మనుబోలు : మండలంలోని మడమనూరు గ్రామంలో ఉన్న గీతా ఆశ్రమంలో ప్రణవానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆశ్రమ స్థాపకర్త సుబ్బమ్మ 15వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. విశేష పూజలు, హోమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ప్రవచన కార్యక్రమాన్ని జరిపారు. 200 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గీతామాత, మస్తానయ్య, వంశీకృష్ణారెడ్డి, లక్ష్మి, పార్థసారథి, మేఘన, భారతి, యోగా గురువు కోటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తవ్వారు..వదిలేశారు

- మినరల్ వాటర్ పైపులైన్ల ఏర్పాటుకు రోడ్లు ధ్వంసం
- గుంతలను పూడ్చకుండా వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న నగర ప్రజలు



చంద్రబాబునగర్‌లో రోడ్డును అడ్డంగా తవ్వి పూడ్చకుండా వదిలేసిన దృశ్యం



శ్రామికనగర్‌లో రోడ్డును తవ్వి పూడ్చకుండా వదిలేసిన దృశ్యం

నెల్లూరు రూరల్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో మినరల్ వాటర్ పైపులైన్ నిర్మాణానికి రోడ్లను ధ్వంసం చేసి పూడ్చకుండా వదిలేయడంతో నగర ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మినరల్ వాటర్ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ పనుల నిర్వహణలో నిర్లిప్త ధోరణి కనబరుస్తోంది. నిర్దేశిత లక్ష్యాలను సాధించడంలో విఫలం చెందుతోంది. గతంలో పలు ప్రాంతాల్లో పైపులైన్ల కోసం తవ్విన గుంతలను నామమాత్రంగా పూడ్చారు. నాటి గుంతలు అలాగే రహదారులపై ఉండగా ఇటీవల తవ్విన గుంతలు ప్రమాద భరితంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించేందుకు అవస్థ పడుతున్నారు. రూరల్ పరిధిలోని కొత్తూరు పరిధిలోని పలు ప్రాంతాల్లో మూడు నెలల క్రితం మినరల్ వాటర్ పైపులైన్ నిర్మాణం పేరిట అడ్డంగా రోడ్లను ధ్వంసం చేశారు. రోడ్లను తవ్వి పైపులైన్లను ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ వాటిని పూడ్చడంలో నిర్లిప్త వైఖరి అవలంభిస్తున్నారు. రోడ్ల ధ్వంసంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నారు. పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

గుంతలను గమనించక అందులో పడి గాయాలపాలవుతున్నారు. 30వ డివిజన్‌లోని శ్రామికనగర్,చంద్రబాబునగర్‌లోని పలు ప్రాంతాల్లో మినరల్ వాటర్ పైపులైన్ నిర్మాణం కోసం తవ్విన గుంతలు గత ఆరు నెలలుగా అలాగే ఉన్నాయి. పైపులైన్ నిర్మాణం కోసం రోడ్లను తవ్వే సమయంలో పలు గృహాల డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ కనెక్షన్లు ధ్వంసం కావడం జరిగింది. వాటిని పునరుద్ధరించాల్సిన కాంట్రాక్ట్ సంస్థ సిబ్బంది తమకు ఏమాత్రం సంబంధం లేదని బుకాయించడంతో ఆయా గృహాలవాసులే ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ ఎలాగోలా ఏర్పాటు చేసుకున్నారు. మినరల్ వాటర్ పైపులైన్ ఏర్పాటు ఎలా ఉన్నా తాము నిత్యం నరకం చూడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై నగర పాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రోడ్ల ధ్వంసంతో అవస్థ



మినరల్ వాటర్ పైపులైన్ నిర్మాణం కోసం బాగున్న రోడ్లను పలు ప్రాంతాల్లో అడ్డంగా ధ్వంసం చేశారు. పైపులైన్లు ఏర్పాటు చేసి మూడు నెలలు గడిచినా గుంతలను అలాగే వదిలేశారు. ఈ కారణంగా వాహనచోదకులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– నాగార్జున్, చంద్రబాబునగర్

ప్రమాదభరితంగా గుంతలు



మినరల్ వాటర్ పైపుల ఏర్పాటు కోసం రోడ్లను అడ్డంగా తవ్వేశారు. పైపులు వేసిన తరువాత గుంతలను పూడ్చే విషయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– ఎం పావని, చంద్రబాబునగర్

రాకపోకలు ఇబ్బందులు పడుతున్నాం



మినరల్ వాటర్ పైపులైన్ పేరుతో బాగున్న రోడ్లను ధ్వంసం చేశారు. పైపులైన్ ఏర్పాటు చేశాక రోడ్ల గుంతలను పూడ్చకుండా అలాగే వదిలివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం.

– రూపేష్‌బాబు, చంద్రబాబునగర్

గుంతలను పూడ్చాలి



మినరల్ వాటర్ పైపులైన్ కోసం తవ్విన గుంతలను పూడ్చాల్సిన అవసరం ఉంది. కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంతో తరచూ రోడ్డు గుంతల్లో పడి పలువురు గాయాలపాలవుతున్నారు.

–బీహార్ బాబు,శ్రామికనగర్

ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు

మినరల్ వాటర్ పైపులైన్ నిర్మాణం కోసం ధ్వంసం చేసిన రోడ్లను పరిశీలిస్తాం. ప్రజలకు ఇబ్బంది కలగకుండా కాంట్రాక్ట్ సంస్థ రోడ్లను పునర్నిర్మించేలా చర్యలు తీసుకుంటాం.

– తిరుపతిరావు, ఏఈ, పబ్లిక్ హెల్త్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను నగర డీఎస్పీ డీ శ్రీనివాసులరెడ్డి నేతృత్వంలో నగర ఇన్‌స్పెక్టర్లు ఆదివారం ఉదయం తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా ముందస్తుగా రౌడీషీటర్లు, ట్రబుల్‌మాంగర్స్, గతంలో ఎన్నికల కేసుల్లో నిందితులుగా ఉన్న వారిని బైండోవర్ చేసుకున్నారు. అనధికార మద్యం విక్రయాలపై దృష్టిసారించారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

14,15న యోగాసన పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14,15 తేదీల్లో మహిళలకు యోగాసన, సూర్య నమస్కారాల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, సెట్నెల్ సీఈఓ డీ పుల్లయ్య ఆదివారం తెలిపారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉదయం 7 గంటలకు పోటీలు జరుగుతాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న పోటీల్లో మహిళలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కళాకారుడు రమణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రమణ

నెల్లూరు(అర్బన్): నెల్లూరు చెందిన కళాకారుడు స్టెప్‌అప్ రమణ మలేషియాకు చెందిన సెయింట్ మదర్ థెరిస్సా వర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. రమణ స్టేజ్ డాన్సర్ నుంచి స్టెప్‌అప్ ఈవెంట్స్ పేరుతో అంచెలంచెలుగా ఎదిగి మూడు, నాలుగు రాష్ట్రాల్లో భారీ ఈవెంట్స్ చేస్తూ కళామతల్లి ముద్దుబిడ్డగా ఎదిగాడు. ఆయన కరోనా సమయంలో శివాజీ యూత్ ఫౌండేషన్‌తో కలిసి వందలాది కుటుంబాలకు సాయం అందించారు. ఈ నేపథ్యంలో రమణ సేవలను గుర్తించి కౌలలాంపూర్‌లోని ఓ హోటల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ బాలమురుగన్ చేతుల మీదుగా డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నేలకుర్తి రమణ మాట్లాడుతూ డాక్టరేట్ తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. కళారంగంతో పాటు సేవారంగంలోనూ తన వంతు పాత్రపోషిస్తానన్నారు. తనకు డాక్టరేట్ రావడానికి సహకరించిన బెంగళూరుకు చెందిన మదర్ థెరిస్సా వర్సిటీ వీసీ డాక్టర్ విజయసరస్వతి, శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూరు భాస్కర్‌నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

వరపరివార్ సేవాఫౌండేషన్ మాధవికి పురస్కారం



నెల్లూరు(అర్బన్): నెల్లూరుకు చెందిన వరపరివార్ సేవా ఫౌండేషన్ అధినేత్రి మాధవి విశ్వంబర నేషనల్ ఉమెన్ స్టార్ లెజెండ్–2023 పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వంబర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో శనివారం పలువురు మహిళలకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాధవిని విశ్వంబర ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు తాళ్లూరు సువర్ణకుమారి సత్కరించి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తన బృందంతో కలిసి తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి జాతీయ స్థాయి ఉత్తమ మహిళా పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు.

ఘనంగా త్యాగరాజ స్మరణోత్సవాలు ప్రారంభం

- వీనులవిందుగా త్యాగరాజ కృతుల ఆలాపన
- పరవశించిన సంగీతాభిమానులు



సీతారామలక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజస్వామి నగరోత్సవం

నెల్లూరు(బృందావనం): వర్ధమాన సంగీత విద్యార్థుల త్యాగరాజ కృతుల ఆలాపన..కళాకారుల నాదస్వర కచేరీ..సంగీత విద్వాంసుల గాత్రకచేరి..పంచరత్న గోష్ఠి గానంతో... సీతారామలక్ష్మణ హనుమంత సమేత త్యాగరాజస్వామి నామస్మరణతో పురమందిరం పులకించింది. 58వ త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా తొలిరోజు భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ పర్యవేక్షణలో ఉదయం నుంచి రాత్రి వరకు సాగిన రసరంజకమైన త్యాగరాజ కృతుల ఆలాపనతో సంగీతాభిమానులు ఆనంద పరవశులయ్యారు. నగరంలోని పురమందిరంలో భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న 58వ త్యాగరాజ స్మరణోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంప్రదాయంగా వేదాయపాళెం, త్యాగరాజ నగర్‌లోని త్యాగరాజస్వామి మందిరం నుంచి పురమందిరం వరకు సీతారామలక్ష్మణ హనుమత్ సమేత త్యాగరాజస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పురమందిరం ప్రాంగణంలోని వేదికపై కొలువుదీర్చి శాస్త్రోక్తంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, విశేషపూజలు నిర్వహించి స్మరణోత్సవాలను ప్రారంభించారు.

వీనులవిందుగా త్యాగరాజ కృతుల ఆలాపన

సంగీత విద్యార్థులు త్యాగరాజ కృతులను ఆలపించి అలరించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక విద్యార్థులు సుమారు 200 మందికి పైగా స్మరణోత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు సుమారు 7గంటలకు పైగా వీనులవిందుగా త్యాగరాజ కృతులను ఆలపించారు. కాగా నగరానికి చెందిన ముస్లిం బాలిక నేహ తన మిత్రబృందం కే మేఘన, ఏ రిషిత, ఎన్వీ సునీష, పీ ఉపజ్ఞశ్రీ,వరుణితో కలిసి గాత్రం చేయడం విశేషం. నేహను స్మరణోత్సవ సభ తరుపున ప్రత్యేకంగా అభినందించినట్లు నాగదేవిప్రసాద్ మాట్లాడుతూ నగరానికి చెందిన ముస్లింబాలిక నేహ తన మిత్రబృందంలోని కె.మేఘన, ఎ.రిషిత, ఎన్వీ సునీష, పి.ఉపజ్ఞశ్రీ,వరుణిలతో కలిసి గాత్రం చేయడం విశేషమన్నారు. ఆ బాలికను స్మరణోత్సవ సభ తరుపున ప్రత్యేకంగా అభినందించినట్లు స్మరణోత్సవ సభ కమిటీ కార్యదర్శి ఎనమంద్ర నాగదేవిప్రసాద్ తెలిపారు.

అలరించిన నాదస్వర కచేరి

ప్రముఖ కళాకారులు వరగలి ఆర్ సుధాకర్ బృందం సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు ప్రదర్శించిన నాద స్వరకచేరి, స్థానిక సంగీత విద్వాంసుల పంచరత్న గోష్ఠిగానం అలరించింది.

కొలువైయున్నాడే..

త్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు కే వందన బృందం ఆధ్వర్యంలో కొలువైయున్నాడే..దేవదేవుడు..కొలువైయున్నాడే..(భైరవిరాగం), దినమణి వంశతిలక (హరికాంభోజిరాగం), నిన్నాడనేలా(కన్నడ రాగం), నే పొగడకుంటే(వరాళి రాగం).. హరిదాసులు వెడలె(యమునా కల్యాణిరాగం) త్యాగరాజకృతులను రసరంజకంగా ఆలపించి సభికుల హర్షధ్వానాలందుకున్నారు. వందన గాత్రానికి డాక్టర్ కొమాండూరి కృష్ణ(వయోలిన్), క్రొత్తపల్లి రమేష్(మృదంగం) ఎం హరిబాబు(ఘటం) వాద్యసహకారం అందించారు. ఈ కార్యక్రమాలను భిక్షాటనా పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, ఎనమంద్ర నాగదేవిప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.



గాత్రకచేరి చేస్తున్న సంగీత విద్యార్థులు



సుధాకర్ బృందం నాదస్వర కచేరి

ప్రజాభిమానాన్ని చూరగొన్న సీఎం వైఎస్ జగన్



ఎంపీ ఆదాల నివాసంలో వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పేర్నాటి, కొండ్రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని నెల్లూరు ఎంపీ, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్సార్ తన పాలనతో పేదల గుండెల్లో గూడు కట్టుకున్నాడన్నారు. ఆయన బాటలోనే తనయుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేసి పంచారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, కార్పొరేటర్లు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్, నాగరాజు, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య, నాయకులు కమలాకర్‌రెడ్డి, ఏసునాయుడు, పెంచల్‌రెడ్డి, పరమేశ్వరరెడ్డి, సురేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని మద్రాసు బస్టాండ్ సెంటర్‌లోని కూరగాయల మార్కెట్‌లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ జెండా మోయడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు జీపీ శ్రావణ కుమార్, యువజన విభాగం నాయకుడు చీడెళ్ల కిషన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ పిలుపు మేరకు నగరంలోని రాజన్న భవన్‌లో పార్టీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. నాడు జగన్‌మోహన్‌రెడ్డి వెంట లక్షలాది మంది ప్రజలు ఒక్క పిలుపుతో కదిలి వచ్చారన్నారు. సంక్షేమ పథకాల అమలుతో తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పుకునేంత గర్వంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు ఉన్నారన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ విద్య, వైద్యానికి పెద్దపీట వేశారన్నారు. ఆయన కుమారుడిగా జగన్‌మోహన్‌రెడ్డి ఆయా రంగాలకు మరింతగా నిధులు విడుదల చేసి జనరంజక పాలన సాగిస్తున్నారన్నారు. 2024లో అనిల్‌కుమార్‌యాదవ్ మళ్లీ గెలిచి మరోదఫా మంత్రి పదవి చేపట్టాలని ఆకాంక్షించారు. యువజన విభాగం నగర అధ్యక్షుడు జయకృష్ణారెడ్డి, నాయకులు సాకేష్ రెడ్డి, శేషు, సాయి కృష్ణ, తౌఫీద్, సాయి, శంకర్, రియా, బాలు, నిఖిల్, లతీష్, తదితరులు పాల్గొన్నారు.



కూరగాయల మార్కెట్లో..



రాజన్న భవన్‌లో కేక్ కట్ చేస్తున్న విద్యార్థి, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు

వివాహిత ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వివాహితను వరకట్నం కోసం చిత్రహింసలకు గురిచేసి ఆమె మరణానికి కారణమైన భర్త, అత్త, మరిదిని నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు..దొంతలికి చెందిన మేఘన(20) నక్కాగోపాల్‌నగర్‌కు చెందిన జిమ్‌ట్రైనర్ ఏకొల్లు కుమార్ అలియాస్ దేవకుమార్ 2021 మేలో ప్రేమ వివాహం చేసుకున్నారు. 8 నెలల క్రితం మేఘన ఓ పాపకు జన్మనిచ్చింది. అప్పట్నుంచి భర్త, అత్త రాధాప్రియ, మరిది జీవన్‌సాగర్ అలియాస్ చింటూ ఆమెను వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించసాగారు. మేఘన తల్లి రూ.30వేలు నగదు, మూడు సవర్ల బంగారు ఆభరణాలు ఇచ్చినా వారు మరింత కట్నం కావాలని ఒత్తిడి తెచ్చారు. ఆమెను సూటిపోటి మాటలతో వేధించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న అర్ధరాత్రి దాటిన తర్వాత మేఘన ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి కేసు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేశారు.

మహిళ ఆత్మహత్యకు కారణమైన..

మహిళ ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు నిందితులను వేదాయపాళెం పోలీసులు సారాయంగడి సెంటర్ వద్ద ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలు..సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన సునంద(34) ఈ నెల 9న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. తన చావుకు స్నేహితుడు కే ప్రదీప్‌రాజు, అతని తల్లి స్వర్ణలతే కారణమని ఆమె రాసిన సూసైడ్ లేఖను మృతురాలి ఇంట్లో వేదాయపాళెం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాని ఆధారంగా ప్రదీప్, అతని తల్లిని అరెస్ట్ చేశామని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

శాంతి కోసం దువా



నెల్లూరు(బృందావనం): దేశంలో ప్రబలిన విషజ్వరాలు తగ్గుముఖం పట్టాలని, ప్రపంచంలోని సమస్త మానవాళి శాంతిగా జీవించాలని కాంక్షిస్తూ చిన్నబజారులోని షాహిన్ షా యే నెల్లూరు హజ్రత్ ఖాజా పీర్ దర్గా షరీఫ్‌లో ఆదివారం దువా చేసినట్లు ముస్లిం యూత్ సేవా జిల్లా అధ్యక్షుడు ఖాలిద్ తెలిపారు. సయ్యద్ యూసఫ్ హుస్సేన్ చిష్టి ఆధ్వర్యంలో బాబు, చాంద్ బాషా తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు వివరించారు.